International Journal of Academic Research
P-ISSN: 2348-7666: Impact Factor: 6.023
Homepage: https://www.ijar.org.in/
Volume-11, Issue-3,July-Sep-2024
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# సంస్కృతి పరిరక్షణ ఆదర్శ మనోజ్ఞ సౌమ్యచంద్రుడు - విద్యారణ్యుడు

డా. రేచర్ల శ్రీలక్ష్మి
తెలుగు అధ్యాపకురాలు ,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శృంగవరపుకోట,
విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్

"సహితస్య భావ సాహిత్యం" అనగా హితముతో కూడినది సాహిత్యం. సాహితీ వైభవానికి ఆద్యుడు, అనవంద్యుడు కవి .కవి తన అక్షర తేజస్సుతో సంఘ రుగ్మతలనే చీకటిని పారద్రోలుతూ సాహితీ వనాన్ని పుష్పఫల సమన్వితం చేస్తాడు.  సాహితీ సృజనకి వస్తువుగా పురాణేతి వృత్తమైనా, జానపద కథాంశమైనా, గొప్ప వీరుల యుగకర్తల చరిత్ర ఐనా కవి ఆ ఇతివృత్తాన్ని శిల్పంగా తీర్చిదిద్దటంలో అతని ప్రతిభ ఆధారపడి ఉంటుంది. ఇతివృత్తాన్ని చరిత్ర నుండీ గ్రహిస్తే అది భావి నిర్దేశానికి, జాతి మనుగడకు, చైతన్యానికి ద్యోతకమౌతుంది. అసలు చెప్పాల్సి వస్తే ఇతిహాసాలు, పురాణాలు కూడా చారిత్రక సాహిత్యానికి నాంది పలికాయి. ఐతే గొప్పవారి విజయగాథలను, వారి వితరణ, శౌర్య పరాక్రమాలు,సద్గుణాదులను, చారిత్రకతను తప్పించుకుండా చరిత్రలో మరుగున ఉన్న మాణిక్యాలను సైతం సానపట్టిన వజ్రాలులాగా కావ్యాలుగా మలిచి సాహిత్య రచన చేస్తే అది జాతి గత వైభవస్మరణకి, సాంస్కృతిక వారసత్వ సంపదకి తద్వారా జాతి యొక్క వికాసానికి తోడ్పడుతుంది. అలా దేశం గర్వించదగ్గ మహనీయులు, చరిత్రలో మణిరత్నాల్లా భాసల్లిన మహోదాత్తులు దార్శనికులు ఎందరో చరిత్రను ఫరిడవిల్లజేశారు. వారిలో ఆర్షధర్మ పరిరక్షణతత్పరులు, వైదిక మార్గ పరివ్రాజకులు, మహాసామ్రాజ్య బీజకులు, సౌమ్యచంద్రుడు, యతీంద్రులు శ్రీ విద్యారణ్య స్వామి విశిష్టులు.

శ్రీ విద్యారణ్యులు శృంగేరి పీఠాధిపతులు క్రీ.శ.1267 నుంచి 1386 వరకు జీవించినట్లు తెలుస్తోంది. ఈయన చిన్ననాడే భువనేశ్వరీ మంత్ర సిద్ధిని పొందినవాడు. చిన్నతనంలోనే సన్యాసం స్వీకరించాడు భారతదేశం రెండు మతాల మధ్య అల్లకల్లోలంగా ఉన్న సమయంలో, హైందవ జాతి ని పరమత విజృంభణ రక్తపాతంలో ముంచెత్తిన కాలంలో మతసంరక్షణకు తద్వారా సాంస్కృతిక పరిరక్షణకు విద్యారణ్యులు కృషిచేశారు. ఆనాడు హరిహర రాయలు, బుక్కరాయలు కాకతీయుల ఆ స్థానంలో ఒకరు కోశాధికారి, ఒకరి మంత్రిగా ఉండగా కాకతీయ సామ్రాజ్యంపై ఢిల్లీ సుల్తాను జునాఖాను దాడి చేసి వీరిద్దరిని బంధీలుగా చేసుకొని ఢిల్లీ తీసుకువెళ్ళి ముస్లిం మతంలోకి మార్చివేసి తన ప్రతినిధులుగా మళ్ళీ దక్షిణ భారతానికి పంపగా హంపి, ఆనెగొంది లోని అటవీ ప్రాంతంలో హరిహర, బుక్కరాయలకు విద్యారణ్యుని దర్శనంతో వారి జీవితాలే కాక చరిత్ర కూడా మలుపు తిరిగింది. వారిలో ఇంకా అంతరించిన శౌర్య, పటిమలు విద్యారణ్యుని ఆకర్షించాయి. వారి రాజసం, హైందవ ధర్మం పట్ల ఉన్న అనురక్తి గ్రహించి వారిని హంపికి ప్రభువులుగా ఉండమని ఆశీర్వదించాడు. అలా హంపిలో ప్రారంభమైన విద్యానగర నిర్మాణామే విజయనగర సామ్రాజ్యంగా రూపొంది అటుపై ఆ వైభవం సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి వంశాలుగా స్థిరపడింది. విజయనగర నిర్మాణం రాజ్యస్థాపన దక్షిణదేశ చరిత్రలో కొత్తశకానికి నాంది పలికింది. తరుష్కుల దండయాత్రలకు నిరసనగా హిందు రాజులలో ఐకమత్యం పెరిగింది. కేవలం రాజ్య నిర్మాణమే కాదు తద్వారా సంస్కృతి, ఆచారాల పరిరక్షణ ఎంతో విలువైన సాహితీ సేవకి, కావ్య సంపదకి భాష పరిపుష్టికి విద్యారణ్యుని రాజ్యస్థాపనే కదా ఆలంబనం. అందుకే ఇంతటి మహోదాత్త మూర్తి కనుకనే హరిహర, బుక్కరాయలు ఇతనిని

> **"శ్రీమన్మ మహారాజాధి రాజ, రాజ పరమేశ్వర, వైదికమార్గ**
> **ప్రవక్త, జీర్ణ కర్ణాటక సింహాసనా స్థాపనాచార్య, శ్రీమత్పరమహంస**
> **పరివ్రాజకాచార్య విద్యారణ్య యతీంద్ర" అని కీర్తించారు.**
>
> **[శ్రీ కృష్ణ దేవరాయలు : 08-2016]**

రాజ్య స్థాపన తర్వాత విజయనగర నిర్మాణానికి విద్యారణ్యుడు విశ్వకర్మ అవతారం ఎత్తాడు. శిల్పులకు తానే వాస్తు నిర్మాణ పద్ధతుల్ని తెలిపేవాడు. అభేద్యమైన ప్రాకారాలతో, తోపుకానాలతో,

నగరాన్ని పటిష్టం చేశాడు. విద్యారణ్యులు హరిహర బుక్కరాయలకు ఆధ్యాత్మిక గురువులు గాను ఉన్నట్లు బుక్కరాయల దానశాసనంలో ఉంది.

**"విద్యాతీర్థజ్ఞని మణిశుభే భారతీర్థపద్మే నిత్యం వృత్తాద్వయ చిదమృతానంద సౌరభ్యభాజ విద్యారణ్యద్యుమణి మహిమ ప్రాప్త లక్ష్మీ విలాసే భూయో భూయో విహరతి సుఖి బుక్క భూపాలహంస"(బుక్కరాయల దాన శాసనం)**

విద్యారణ్యులు మహాదార్శనికులు సంస్కర్తగా మతోద్ధారకుడిగా వర్తిల్లుతూ తపస్సుతో ముక్తి పొందారు. ఈయన విగ్రహం ఇప్పటికీ వాంపీక్షేత్రంలో విరూపాక్షుని గుడి వెనుక ఉన్నది. రోజూ పూజా పునస్కారాలు, ఏటేటా ఉత్సవాలు జరుగుతాయి. ఆ విగ్రహాన్ని చూసిన భావవేశంలో కొడాలి సుబ్బారావు గారు తన ''హంపీక్షేత్రం'' కావ్యంలో ఇలా వర్ణన చేస్తారు.

**"అప్పుడు పురాణ కాలమున యందు వశిష్ఠుడు రాజ్యవేత్తలన్ నిపుణుడు సాధు పుంగవుడు నేడు మహాత్ముడు గాంధీ, తెల్లభూ మిపతి చరిత్ర వేళను సుమియుగ మధ్యమునందు నీవు మా తృపద నితాంత పూజకు విధించిన బ్రహ్మము మూడు మూర్తులా**
**ఒక చేతన పాడైన ఓరుగల్లు సిరులను విద్యానగర రాజ వీధీ కెత్తాడట ఒక చేత క్షీణిస్తున్న హిందూమత వైశాల్య భావాలను ఎత్తి మరోచేత రాజకీయోన్నతిలో మంత్రశక్తియుక్తుల పరజాలనెత్తి ఒకచేత యోగసాయుజ్యాంతరానంద తత్వసారాచ్ఛ సాధనములెత్తి"**

**[హంపీక్షేత్రం : 20:1933]**

అంటూ పద్యంలో విద్యానగర నిర్మాణం, హైందవ మత ఉద్ధరణ, రాజకీయ అనిశ్చితి తొలగింపును చెప్తూ మరో పద్యంలో పురాణకాలంలో వశిష్టునిలా, ఆధునిక కాలంలో గాంధీలా, మధ్యకాలంలో విద్యారణ్యులు భారతమాత పూజకు నిర్దేశించబడ్డారు అంటూ త్రిమూర్తులతో వీరి ముగ్గురుని పోల్చాడు కవి. మొదటిసారి పరదా అనే పదాన్ని "పరజా" అని కవి ప్రయోగించడం ఇక్కడ గమనించవచ్చు.

విద్యారణ్యులు ఆర్షధర్మ పరిరక్షణకై గ్రంథ రచన కూడా చేశారు. ఈయన సుమారు 14 గ్రంథాలు రచించడమే కాక తన శిష్య ప్రశిష్యులతో కూడా గ్రంథ రచన చేయించారు. వీటిలో శివతత్వ రత్నాకరం,

విద్యారణ్య కాలజ్ఞానం, వేదభాష్యం ప్రసిద్ధమైనవి. పరాశర మాధవీయం, వ్యవహార మాధవీయం, సంగీతసారం, బృహదారణ్యక, ఛాందోగ్య, ఐతరేయ, తైత్తిరీయ, కైవల్య, నృసింహ, ఉత్తరతాపనీయ, ఉపనిషత్తులకు స్వతంత్ర వ్యాఖ్య రాశారు. వీరి శిష్యులైన మాధవమంత్రి "పరాశరస్మృతి", వ్యవహార మాధవీయం, కాలమాధవీయం, జైమిని న్యాయమాల, విస్తారము మొదలైన గ్రంథాలు రచించాడు. భోగనాథుడు "ఉదాహరణమాల", సాయణుడు వేదభాష్యం రచించారు. వీరిలో మాధవమంత్రి హరిహర బుక్కరాయలకు మంత్రిగా ఉండి వారి తరపున శృంగేరి జగద్గురువుల వద్దకు అనేక పర్యాయాలు కానుకలు తీసుకువెళ్ళి సమర్పించాడు. ఐతే చరిత్ర తెలియని కొందరు ఈ మాధవమంత్రి సన్యసించి విద్యారణ్యులు అయ్యారని రాశారు. కానీ మాధవమంత్రి సన్యసించింది 1370 తర్వాత అంతకన్నా ముందే 1336లోనే విజయనగరం స్థాపించబడింది. కనుక ఈ వాదన సరైంది కాదు. 1380లో విద్యారణ్యులు శృంగేరి పీఠాధిపతి అయ్యారు. 1386లో విద్యారణ్యులు కైవల్యం పొందారు. శృంగేరి పీఠం రికార్డుల ఆధారంగా శ్రీ తుమ్మలపల్లి హరిహరశర్మ గారు ఈ విషయాలను స్పష్టం చేశారు.

విశ్వనాథ నాయకుని స్థానాపతి రచించిన "రాయవాచకం" ప్రసిద్ధ గ్రంథం. ఇది రాయలనాటి చరిత్రను తెలిపే ఒక మహత్తర గ్రంథం. ఈ కావ్యమందు విద్యారణ్యుల ప్రశంస మిగులంగా ఉంది. విద్యారణ్యులు జ్ఞానేంద్ర సరస్వతుల శిష్యులని, వారు గురు ఆదేశం ప్రకారం కాశీయాత్ర చేస్తూ దారిలో శింగిరిభట్లు అను ఒక మహర్షిని, దివ్యపురుషుని గాంచి ఆతని అనుగ్రహంతో వ్యాసులవారి దర్శనం పొందినట్లు, వ్యాసుడి ఆశీర్వాదం శింగిరిభట్ల ఆశీర్వచనంతో విద్యానగరపట్టణ నిర్మాణం చేసినట్లు తెలుస్తోంది.

**"మధ్యాహ్నకాలమందు శింగిరిభట్లు పలికిన ప్రకారానకు వేషము వేసుకొని వచ్చే వేదవ్యాసుల గనుకొని సాష్టాంగ నమస్కారములుజేసి రెండు పాదములున్ను కన్నుల నొత్తుక భక్తియై నిలిచిన సన్యాసిని జూచి యీతండు మా స్వరూపం తెలిసినది యెట్టు అని జ్ఞానదృష్టికి జూచి విద్యారణ్యులతోను మీరు శింగిరిభట్లు దెలుపగా గదా మా స్వరూపం యెరిగితిరి అయితే మంచిదాయెను శింగిరిభట్లు బహుకాలముగా మాకు స్నేహమై ఉండను. ఆయనకు నిద్రా ఆహారములు లేక అశ్వద్ధవన యందు చాలా అవధి పడుతున్నాడు నిన్నుంచి కర్నాటకాన వఖనగరం కానున్నది. అందు మున్నూట అరవైయేడ్లు లక్ష్మీకటాక్షం కలిగి ఉండును. ఆ పట్టం వున్ననాళ్ళకు ఆ**

**సింహాసనస్థునితో దెలిపి శింగిరిభట్లను ప్రీతిగా నిత్యకృత్యమున్ను పంచభక్ష్య పరమాన్నములతోడట్టు మృష్టాన్నముగా సహస్ర బ్రహ్మణ భోజనం శేయించమని ఆ నరపతితో వలికి ఆనగ మందు ముప్పై నృపతులు కీర్తి ఖ్యాతుగల్గి నడవ కారణమున్నది అని పలకరించి కొన్ని మంత్ర రహస్యములున్ను విద్యారణ్యులకు అనుగ్రహించి వేదవ్యాసులు అదృశ్యలయిపోగాను విద్యారణ్యులు ఆనందభరితుండై ప్రజలందరున్ను సుఖస్థితిని వుండవలెను, అందు నుంచిన్ని తన పేరు కీర్తిన్ని శాశ్వతుముగా నిలుచును, భూలోకమందు ఎవ్వని పేరయినా యెన్నాళ్ళు వెలయతా వున్నదో అన్నాళ్ళు ప్రజలకు స్వర్గాది భాగములున్ను ఐశ్వర్య ప్రదమున్ను పుత్రపౌత్రాదివృద్ధిన్ని కలిగి ఉండును. గనక తాము గావించే పట్టమందు మీరు శాశ్వతముగ వండేటట్టు ఆనతీయవలెనని లక్ష్మీదేవిని ప్రార్ధన శేయంగా ఆమహాదేవి మీ మనస్సు ప్రకారం వచ్చియుండేమని అనుగ్రహించి, నీవు మమ్ము తిరిగి జూడక పొమ్ము మేము నీ వెంబడిగా వస్తావున్నారమని ఆనతిచ్చి పంపగ........."( రాయవాచకం, 26)**

**పై వాక్యాలను బట్టి విద్యారణ్యులకు రాజ్యనిర్మాణానికి కావాలసిన శక్తి, మంత్రోపదేశం, లక్ష్మీకటాక్షం ఎలా** సిద్ధించాయో తెలుస్తోంది. విజయనగర చక్రవర్తులు శృంగేరి పీఠాన్ని సందర్శించడం, భక్తి ప్రపత్తులు కనపరచడం కూడా ఈ వృత్తాంతం ద్వారా తెలుస్తోంది.

చరిత్రలో పేరెన్నికగన్న వ్యక్తులు కొందరైతే చరిత్రనే మలిచిన ఉత్కృష్టులు ఇంకొందరు. వారిలో అగ్రతాంబూలం అందుకోవలసిన మహాదార్శనికులు విద్యారణ్యులు ఆర్యధర్మమును నిర్మూలించుటకై పొంగి పొరలి వచ్చిన ముస్లిం సేనావాహినులనరికట్టి, దానిని ప్రతిఘటించి నిలువగల శక్తిని హిందూ సమాజమునకు కలిగించి, వైదిక లౌకిక ధర్మ ప్రచారకులై, వేదశాస్త్రాల ఉద్ధారకులై విభిన్న సంప్రదాయాలకు సమన్వయ సామరస్య సంపాదకులై, ఒక మహాసామ్రాజ్య ప్రతిష్ఠాపనా చార్యులై ఖ్యాతిగాంచిన మహా పురుషుడు విద్యారణ్య స్వామి .హైందవ ధర్మ చరిత్రలోను, దక్షిణ భారత రాజకీయ చరిత్రలోను వీరి కీర్తి శాశ్వతమై ఉన్నది. అంతటి మహోన్నతున్ని కన్న ఈ నేల నిజంగానే రత్నగర్భ.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. రాయవాచకం - విశ్వనాథ నాయకుని స్థానాపతి సాహిత్య అకాడమి, హైదరాబాద్: 1982

2. శ్రీ కృష్ణ దేవరాయలు వల్లభనేని అరుణకుమారి రీమ్స్ పబ్లికేషన్స్, ఢిల్లీ: 2010

3. శ్రీ కృష్ణ దేవరాయల కీర్తి చంద్రిక వడ్డి విజయ సారధి నవయుగ భారతి, హైదరాబాద్ : 2011.

4. హంపిక్షేత్రము - కొడాలి సుబ్బరావు : ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాల, బెజవాడ: 1933